# సముద్రం

సయ్యద్ సలీమ్

పుట్టి పెరిగిన కొత్తపట్నం వదిలి – హైద్రాబాద్ లో ఉంటున్న కొడుకు దగ్గరకొచ్చి పదిరోజులే ఐనా – పది యుగాలుగా ఉంది కొమరయ్యకు.

కొత్తపట్నం ఒంగోలుకు పదమూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సముద్ర తీరం...

అతనికి సముద్రమంటే అమ్మ ఒడి.... జీవితంలో అఆలు దిద్దించిన బడి....అమ్మోరు కొలువైన గుడి.

అతను పుట్టిన క్షణమే చెవుల్లో ఓంకార నాదం వూదిన సముద్రం...రాత్రుళ్ళు జోకొట్టి నిద్ర పుచ్చిన సముద్రం. అమ్మ గుండెలమీద ఆడుకున్నట్లు అలల తలలమీద సయ్యాటలాడి...మెరిసే తడి యిసుకలో పిచ్చుకగూళ్ళు కట్టుకుని మురిసి...చిలిపి నేస్తాల్లా వాటిని చెరిపేస్తున్న కెరటాల మీద కినిసి... ఎంత తీయటి అనుభూతి!

హైద్రాబాద్ అతనికి కీకారణ్యంలా అన్పిస్తోంది.

''చెప్పకుండా బైటికెళ్ళేవు... ఇది మహానగరం. ఇరవైయేళ్ళనించి ఉంటున్న మాకే ఒక్కోసారి అర్థంకాదు.'' అంటూ హెచ్చరించిన కొడుకు.. 'నా చిటికెన వేలు వదిలేస్తే జాతరలో తప్పిపోతావు జాగ్రత్త' అంటూ తండ్రి కొడుకుని బెది





## నేను మరీ చిన్నపిల్లని

పాత్రల పరంగా ఈమధ్య కాలంలో చాలా జాగ్రత్తగా అడుగులేస్తున్నాను. రెండు మూడు సినిమాల్లో సెకండ్ క్యారెక్టర్లు వచ్చినంత మాత్రాన నన్ను సెకండ్ హీరోయిన్ అనుకోవాల్సిన పనిలేదు. పరిణీత సినిమాలో సెకండ్‌రోల్ అయినా ఆకట్టుకునేదే.. అంటోంది బెంగాలీ భామ రైమా సేన్. మంచి డైరెక్టర్లు, మంచి హీరోలు అన్నీ సెలక్టివ్‌గానే చూసుకుంటోందిట. కెరీర్ అలా వుంచితే రైమా పెళ్లి విషయం గురించి భలే చెప్పుకొచ్చింది. ఆమధ్య పెళ్లెప్పుడు చేసుకుంటున్నారు అని ఎవరో అడిగితే.. నేను మరీ చిన్నపిల్లను. ఒకవేళ నేను పెళ్లికి ఒప్పుకున్నా అందరూ అప్పుడే పెళ్లెందుకు అని అంటారు అని వయసు మరీ తక్కువ చేసి చెప్పిందిట. అయితే ఎక్స్‌పోజింగ్ విషయాల్లో మాత్రం చాలా పెద్దపిల్ల లాగే కనిపిస్తోంది కదూ!

రించినట్లు....

''మహా సముద్దరాన్ని సీల్సుకుంటూ సగందాక ఎల్లి – దాన్నోట్లో సెయ్యెట్టి లాక్కున్నట్టు సేపల్ని పట్టుకుని తిరిగొచ్చినోడిని. నాకేం కాదులేరా అయ్యా'' అన్నా విన్లేదు.

''అది సముద్రం. తన గుండెలమీద నిన్నాడించి, అరచేతిలో పెట్టుకుని నిన్ను ఒడ్డుకి చేర్చి ఉంటుంది. ఇది నగరం. రెండు కాళ్ళతో నడిచే తిమింగలాలు నిన్ను గుటుక్కున మింగేస్తాయి...జాగ్రత్త'' అంటూ భయపెట్టిన కొడుకు....

మందంగా కట్టుకున్న కాంక్రీట్ గోడల మధ్య బందీలా...మూలల్లో అమర్చిన ప్లాస్టిక్ పూలని చూస్తూ...టీవి శబ్దాలు వింటూ...యింట్లో నలుగురు మనుషులున్నా ఏకాకిలా...

''ఉదయం లేసిందగ్గర్నుంచి గుమ్మానికి తోరనంలా కల్ల ముందు ఏలాడే సముద్దరం... సెవుల్లో సంగీతంలా ఇన్పించే ఆ హోరు అలవాటైందయ్యా. నీ యిల్లు శానా అందంగా ఉంది. కాదనను. కానీ నాకేమీ తోసటం లేదురయ్యా. మనూరి దిక్కుకి మనసు లాగేస్తోంది.'' ఓ రోజు కొడుకుతో మొరపెట్టుకున్నాడు.

అపుడు ట్యాంక్‌బండ్‌కి పిల్చుకెళ్ళి ''యిదుగో. ఈ హుస్సేన్‌సాగరే మా సముద్రం. ఏమీ తోచనపుడు, మనూరు గుర్తొచ్చినపుడు ఇక్కడికొచ్చి కూచుంటో ఉండు'' అంటూ యింటినుండి ట్యాంక్ బండ్‌కి ఎలా వెళ్ళాలో చూపించాడు.

అతని కొడుకుంటున్నది ఆదర్శనగర్ కావటం వల్ల పదడుగులు వేస్తే నెక్లెస్ రోడ్....

ఆ రోజు ఆదివారం...

విరిగిపోయిన ఓ యినుప బెంచీ మీద కూచుని బుద్ధవిగ్రహాన్ని, దూరంగా అస్తమిస్తున్న సూర్యుణ్ణి చూస్తున్నాడు కొమరయ్య.

కాంతి వలల్ని లోకం మీదికి విసిరివిసిరి అలసిసొలసి తన గుడిశెకు చేరుకుంటున్న సూరీడు తెప్పమీద ఒడ్డుకి తిరిగొస్తున్న జాలరిలా ఉన్నాడు. నీలాకాశం నేలమీద వాలి అలల్లా కదుల్తున్నట్టు అనంతంగా విస్తరించిన సముద్రానికీ హుస్సేన్ సాగర్‌కీ సాపత్యమే కన్పించటం లేదు. తెల్లటి నురగని కురుల్లో మల్లెల్లా తురుముకుని ఉరకలెత్తే కెరటాల సోయగాలు..అనవరతం ఘోషిస్తూ అలల కలకలంతో అలుపెరుగని సందడి...సముద్రం.

నేల ఈనినట్టు జనాలు...నెక్లెస్ రోడ్డు నిండా...

కానీ ఒక్కడు కూడా హుస్సేన్ సాగర్ నీళ్ళనీ – అందులో తేలియాడ్తున్న విద్యుద్దీపాల నీడల్ని – అలల కదలికల్లో వూపిరిపోసుకుంటున్న వెల్తురు పూల అందాల్ని ఆస్వాదించటంలేదు.

కబుర్లు.. ఐస్‌క్రీంలు తింటూ..పల్లీలు నములుతూ...ఆదివారం కాబట్టి ఆరుబైట గడపాలన్న ధ్యాస తప్ప చుట్టూ ఉన్న ప్రకృతి సౌందర్యాన్ని పరికించే తీరుబాటు లేదు.

కొత్తపట్నం సముద్రస్నానానికి వచ్చే మనుషులు గుర్తొచ్చారతనికి.

ఆదివారం వచ్చిందంటే చాలు సముద్రతీరమంతా కోటప్పకొండ తిరునాళ్ళలా ఉంటుంది. రంగురంగుల బట్టలు తొడుక్కుని సముద్రస్నానానికి వచ్చే కుటుంబాలు..చుట్టుపక్కల వూళ్ళనుంచి వచ్చే కాలేజీ విద్యార్థులు....సముద్రం వారికి సంతోషాన్ని పంచే సాధనం. తీరం వెంబడి ఆడుకుని, గవ్వలేరుకుని, నీళ్ళలో గంతులేసి, స్నానాలు చేసి... వెళ్ళే ముందు మంచినీళ్ళ స్నానంతో ముత్యాల్లా మెరుస్తూ వెళ్తారు.

కానీ తన బెస్తలకు..సముద్రం ఆకలి తీర్చే అమ్మతల్లి. తెప్పలమీద, పడవల మీద తన బిడ్డలు ఎపుడెపుడు వస్తారా అని ఎదురుచూస్తూ ఉంటుందేమో...వేటకు వెళ్ళటమే ఆలస్యం దోసిళ్ళ నిండా చేపల్ని నింపుకుని తమ వలల్లోకి జారవిడుస్తుంది.

బెస్తల నరాల్లో ప్రవహించేది రక్తం కాదు. సముద్రపు ఉప్పు నీరే...

బతుకూ చావు సముద్రంతో ముడిపడిన జీవితాలు తమవి.

తన పదేళ్ళప్పుడు చేపలకోసం సముద్రంలోకెళ్ళిన అయ్య మరలి రాలేదు.

తనూ వస్తానని ఎంత మారాం చేసినా వినకుండా వెళ్ళిపోయిన అయ్య...అమ్మ తోడుగా వదిలేసి పోయిన అయ్య...

ఆ రోజు ఆకాశం నల్లటి మేఘాల్తో భయపెట్టింది. అలలు ఎత్తుగా రాకాసి జడల్లా ఎగసిపడ్డాయి. సముద్ర ఘోష జోలపాటలా కాకుండా భీకర గర్జనలా విన్పించింది.

తుఫాను..అమ్మ ఏడుపు...చుట్టుపక్కల వున్న పాతిక ముప్పై గుడిశెల్లో ఆడాళ్ళ, పిల్లల ఏడ్పులు మరో సముద్రాన్ని తలపించాయి.

వేటకెళ్ళిన పాతికమంది జాలర్లలో మరునాడు సాయంత్రానికి నలుగురు తిరిగొచ్చారు. వాళ్ళలో తన అయ్య లేడు.

సంపాదించే ఒకే ఒక ఆధారంపోయింది. అప్పుడాదుకుంది పక్కింటి ఈరయ్య. తన యిద్దరు కొడుకుల్తో పాటు తననూ వేటకు పిల్చుకెళ్ళేవాడు. తెడ్డు ఎలా వేయాలో, ఒడ్డుకి విసిరి కొడ్తున్న అలలమీంచి అలవోకగా తెప్పను ఎలా సముద్రంలోకి తీసుకెళ్ళాలో, వల ఎలా విసరాలో, ఏ ప్రాంతంలో విసిర్తే చేపలు ఎక్కువ పడ్తాయో, ఏ రకమైన జాగ్రత్తలు తీసుకోవాలో... ఇయన్నీ నేర్పాడు.

తనకు పెళ్ళై కొడుకు పుట్టాక – సముద్ర స్నానానికి వచ్చే స్కూలు పిల్లల్ని చూసి 'నేనూ సదూకుంటానయ్యా' అన్నాడు.

ఏది ఏమైనా తన కొడుకు కోరిక తీర్చాలన్న పట్టుదలతో వూళ్ళోని బడికి పంపించాడు. వాడు బాగా చదువుకుంటుంటే చూసి మురిసిపోయాడు. ఐదో తరగతి పూర్తయ్యాక ఒంగోల్లో ప్రభుత్వ హాస్టల్లో చేర్పించి చదివించాడు. తన కొడుకు శర్మా కాలేజిలో చదివి మంచి మార్కుల్తో డిగ్రీ పాసైనపుడు అతని ఆనందానికి అవధుల్లేవు.

కష్టపడి చదివించినందుకు ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వ శాఖలో ఉద్యోగం వచ్చింది. హైద్రాబాద్‌లో ఉద్యోగం...కొడుకు ఎన్నిసార్లు హైద్రాబాద్ రమ్మని పిల్చినా సున్నితంగా తోసిపుచ్చాడు.

తనకు సముద్రాన్ని చూడందే తోచదు. ఆ హోరు వినందే నిద్ర పట్టదు. సముద్రం మీంచి వీచే గాలిలోని నీచు వాసన ముందు మల్లెల, జాజుల పరిమళం ఏపాటి అన్పిస్తుంది. గోచీలు పెట్టుకుని తెప్పల మీద వేటకెళ్ళే తోటి జాలర్లను చూస్తే అభిమానం సముద్రంలా పొంగుతుంది.

అందుకే కొత్తపట్నం వదిలి ససేమిరా రానన్నాడు.

'' నేనింత సంపాయిస్తున్నాగా..యింకా చేపలు పట్టాల్సిన ఖర్మ నీకేంటి'' అని కొడుకు చాలా మార్లు మందలించాడు.

''సేపల్ని పట్టటం కర్మెందుకైంది? అది నా పుట్టుకతో అబ్బిన ఇద్యరా. నా రకతంలో కలిసిపోయిన యాపకం. ఆ సేపల్ని పట్టే కదయ్యా నిన్నింతోన్ని సేసింది'' అనేవాడు తను.

సముద్రం అంటే తనకెంత ప్రాణమో అంతే ప్రాణంలా చూసుకున్న తన భార్య ఏడాది క్రితం చనిపోయింది.

అప్పటినుండీ కొడుకు పోరు మరీ ఎక్కువైంది. ''ఒంటరిగా ఆ గుడిశెలో ..పూటకింత వండిపెట్టే వాళ్ళు లేక ఎందుకవస్థ పడ్తావు? హైద్రాబాద్ వచ్చేయి. నీ కోడలు వండింది తింటూ... మనవణ్ణీ, మనవరాల్నీ చూసుకుంటూ హాయిగా ఉండొచ్చు.'' అంటూ బలవంతపెట్టాడు.

''నేనొంటరినెందుకైతనయ్యా... ఈ బూమ్మీద పడ్డకాన్నించి నాకు తోడుగా ఉన్న ఈ సముద్దరం లేదా...నాతోటి బెస్తవాల్లు లేరా.. సెవులకింపైన అలల సంగీతం లేదా'' అన్నాడు.

ఐనా కొడుకు వూర్కోలేదు. అందుకే పదిరోజుల క్రితం హైద్రాబాద్ వచ్చాడు.వచ్చిన క్షణం నుంచీ జైలు గదిలో బంధించినట్లు వూపిరాడ్డం లేదు.

చీకట్లు అలుముకున్నాయి. కొమరయ్య భారంగా యింటి వైపుకు నడిచాడు.

***

రకరకాల రణగొణ ధ్వనులు...వేగంగా దూసుకెళ్తున్న వాహనాలు...

వేగంగా నడుస్తున్న మనుషులు...పరుగు...మనుషులు కూడా యంత్రాల్లా...పొగ...ధూళి...నల్లటి మేఘాల్లా కమ్ముకుని..

యింటికెళ్ళేప్పటికి కొడుకు సోఫాలో కూచుని టీవీ చూస్తున్నాడు. పిల్లలిద్దరూ మేడమీద గదిలో చదువుకుంటున్నారు. కోడలు వంటగదిలో ఉంది.

తండ్రి దిగులుగా ఉండటం చూసి ''ఏంటయ్యా అలా ఉన్నావు? ఒంట్లో బాగాలేదా'' అని అడిగాడు.

''మన కొత్త పట్నం ...మన బెస్తపల్లె గురుతుకొస్తుందిరయ్యా '' అన్నాడు కొమరయ్య.

''నీకెన్ని సార్లు చెప్పాను మనం బెస్తవాళ్ళమనే విషయం పెద్దగా మాట్లాడొద్దని? అయన్నీ మర్చిపోవాలనే కదా నిన్నిక్కడికి పిలిపించుకుంది. సంఘంలో నాకో గౌరవం ఉంది. హోదా ఉంది. ఆ విషయం మర్చిపోవద్దు'' కొడుకు గొంతులో చిరాకు.

''అదేం మాటరయ్యా...మనం బెస్తవాల్లమేగా. అందులో సిగ్గుపడాల్సిన ఇసయమేదో నాకు ఎరిక కావటం లేదు. నీ పిలకాయలు అలాగన్నా ఒకమాదిరి. ఆల్లు పెరిగిన యిల్లు, పీల్సిన గాలి యేరు. నీ ఇసయం అలా గాదు. సేపల్ని పట్టి అమ్మంగా వచ్చిన పైకంతో గదా నిన్నింత సదివించా, నువ్వింత పెద్దోడివైనావు''

''అదంతా గతం. యిపుడవసరమా చెప్పు. మనం బెస్తవాళ్ళమని పదిమందికీ తెలియాలా? నువ్వెక్కడికీ వెళ్ళటానికి వీల్లేదు. హాయిగా విశ్రాంతి తీసుకో''

ఈ కృత్రిమమైన మనుషుల మధ్య, ఈ అసహజమైన వాతావరణంలో విశ్రాంతి ఎలా దొరుకుతుందో కొమరయ్యకు అర్థం కాలేదు.

ఆ రాత్రి కూడా అతనికి నిద్ర పట్టలేదు.

***

డిసెంబరు నెల – చివరి ఆది వారం.

కొడుకు అత్యవసర సమావేశమేదో ఉందని బైటకెళ్ళాడు.

మనవడు ఇండియా బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్‌ని టీవిలో ఆసక్తిగా చూస్తున్నాడు.

మేడమీది లాంజ్‌లోని మరో టీవిలో ఛానెల్ చూస్తోంది మనవరాలు.

అతనికి అశాంతిగా ఉంది. మనసంతా ఎందుకో అల్లకల్లోలంగా ఉంది. తుఫాను మధ్య చిక్కుకున్న తెప్పలా....

నీలినీలి కెరటాల చేతులు చాపి సముద్రం పిలుస్తున్నట్టు...

తన జీవితమే సముద్రం...తన ప్రాణం సముద్రం...

''అమ్మా ఫ్లాష్ న్యూస్! సముద్రంలో సునామీ వచ్చిందిట. చాలా మంది కొట్టుకుపోయారట'' మనవడు అరిచిన అరుపుకి అతను అప్రమత్తమైనాడు.

కోడలు బైటికి రాకుండానే ''సునామీ ఏమిట్రా?'' అంది,.

కొమరయ్యకూ అర్థం కాలేదు. సముద్రంలో ఏదో వచ్చిందనీ దాని వల్ల ప్రాణ నష్టం జరిగిందని మాత్రం అర్థమైంది. ఉప్పెన రావటం విన్నాడు. తుఫాను రావటం విన్నాడు. సముద్రంలో సుడిగుండాలు విన్నాడు. బడబాగ్ని గురించి విన్నాడు. ఈ సునామీ ఏమిటో ఎప్పుడూ విన్లేదు.

మనవడి దగ్గరకెళ్ళి ఆదుర్దాగా అడిగాడు. ''సముద్దరంలో ఏమొచ్చింది బాబూ''


''సునామీ తాతయ్యా''

''అంటే''

సునామీ అంటే సముద్రం లోపల వచ్చే భూకంపం.''

''బూకంపమా...సముద్దరంలోనా.. ఎన్నడూ ఇనలేదయ్యా..అదొస్తే ఏమౌతది?

''దాని వల్ల అలలు తాటి చెట్టంత ఎత్తుకి లేచిప



డ్డాయట. మా టీచర్ చెప్పింది. యిపుడలానే జరిగుంటది. బీచ్‌లో మార్నింగ్ వాక్‌కి అదే నడవటానికి వెళ్ళిన వాళ్ళంతా కొట్టుకుపోయారట. శ్రీలంక, ఇండోనేషియా, మలేషియా, అండమాన్ నికోబార్ దీవులు...''

''మన దేశంలో కూడానా''

''ఆ ... చెన్నయ్ అదే మద్రాసు, కేరళ, మన రాష్ట్రంలో నెల్లూరు, మచిలీపట్నం...''

కొమరయ్య గుండె వేగంగా కొట్టుకుంటోంది.

''మా కొత్తపట్నం ఏమైంది బాబూ?''

''క్రికెట్ చూడాలి తాతయ్యా.... పైకెళ్ళి చెల్లినడుగు. న్యూస్ ఛానెల్ పెడ్తే అన్నీ తెలుస్తాయి.''

అతనికి దుఃఖం ఆగటం లేదు. తన వూరేమైంది? తన వాళ్ళేమైనారు? తను ప్రాణంలా ప్రేమించిన సముద్రం తనవాళ్ళందర్నీ పొట్టన పెట్టుకుందా?

అతను గబగబా మెట్లెక్కి మనవరాలి దగ్గరకెళ్ళాడు. ఏదో తెలీని భయంతో అతని మొహం వివర్ణమైంది. ''సముద్దరంలో అదేదో వచ్చిందంట. మా కొత్తపట్నం ఏమైందో కాసింత సూసి సెప్పు తల్లీ.''

**యిన్నాళ్ళూ సముద్రం లోపల హాయిగా, స్వేచ్ఛగా సంచరించే జలప్రాణుల్ని మనుషులు వలలు విసిరి పట్టుకున్నారు. ఆ కోపంతోనేమో! ఈసారి సముద్రం తన భీకరమైన అలల వలలు విసిరి తీర ప్రాంతాల్లో స్వేచ్ఛగా తిరుగాడుతున్న మనుషుల ప్రాణాల్ని పట్టుకెళ్ళిపోయింది.**

అతనికి బెస్తపల్లెలోని తోటి జాలర్లందరూ గుర్తొచ్చారు. చేపల వేటకెళ్ళినవాళ్ళు ఏమైనారో? తను నాన్నని పోగొట్టుకున్నట్లు ఎంతమంది పిల్లలు నాన్నల్ని పోగొట్టుకున్నారో? ఎంతమంది అనాథలైనారో?

ఎంత సేపు నిలబడ్డా మనవరాలు పాటలు చూస్తోంది తప్ప ఛానెల్ మార్చలేదు.

''నాకేదో బయంగా ఉంది తల్లీ... సెప్పమ్మా'' అన్నాడు. అలా అంటున్నప్పుడు అతని గొంతు గాద్గదికమైంది.

''నేను పాటలు చూడాలి తాతయ్యా'' అందా పిల్ల టీవీమీంచి చూపు మరల్చకుండానే.

మరల కిందికొచ్చాడు. 'మనవరాలంటే చిన్న పిల్ల. మనవడు పదో తరగతి చదువుతున్నాడు. తనడిగింది చెప్తాడు..' అనుకుని సమాధానపడ్డాడు.

''బాబూ... మా కొత్తపట్నం ఇసయం ఏమైనా సెప్పారా?''

''క్రికెట్ ఐపోనీ ఛానెల్ మారుస్తాను. అప్పటివరకూ కింద ఇచ్చే ఫ్లాష్ న్యూస్ చెప్తా కూచో. చాలా వూళ్ళు మునిగిపోయాయట. మద్రాస్‌లో అష్టలక్ష్మి గుడి వరకూ నీళ్ళొచ్చాయట. కన్యాకుమారిలోని రాక్ మెమోరియల్ పైన వెయ్యిమందికి పైగా చిక్కుకుపోయారట''

''మా కొత్తపట్నం....''

''మీ కొత్తపట్నం గురించి ఏమీ రాయటంలేదు. నన్ను విసిగించకు'' మనవడు విసుక్కున్నాడు.

***

మధ్యాహ్నం రెండు దాటినా అతనికి ఆకలి వేయలేదు.

''ఎవరో ఎక్కడో చచ్చిపోతే నీకేమైంది? మన చుట్టాలా పక్కాలా ...మెతుకు ముట్టనంటావేమిటి?'' అన్నం తినమని రెండుమూడుసార్లడిగిన కోడలు కోప్పడింది.

''నా సుట్టాలే తల్లీ...అందరూ నా వాల్లే'' అన్నప్పుడు అతని వైపు వింతగా చూసి గొణుక్కుంటో లోపలికెళ్ళిపోయింది.

అతను మనవడి పక్కనే కూచున్నాడు. మధ్యమధ్యలో అతను చెప్పే వార్తల కోసం...

వార్తల్లో కొత్తపట్నం గురించిన కబురేదైనా తెలుస్తుందన్న ఆదుర్దా అతనిలో....

సముద్రంలో భూకంపం రావడమేమిటి? ఎప్పుడైనా విన్నాడా? చోద్యం కాకపోతే...భూకంపం భూమ్మీద కదా రావాలి...

''ముఫ్పైవేల మందికి పైగా చచ్చిపోయారట తాతయ్యా!''

ముఫ్పైవేల మంది...జల ప్రళయం అంటే ఇదేనేమో... ఎన్నిజాలర్ల కుటుంబాలు సముద్రపు కోపాగ్నిలో ఆహుతయిపోయి ఉంటాయో... ఎన్ని బెస్తవాడలు శ్మశానవాటికల్లా మారిపోయి ఉంటాయో... ఎంతమంది జాలర్లు సముద్రంలో జలసమాధి అయి ఉంటారో...

యిన్నాళ్ళూ సముద్రం లోపల హాయిగా, స్వేచ్ఛగా సంచరించే జలప్రాణుల్ని మనుషులు వలలు విసిరి పట్టుకున్నారు. ఆ కోపంతోనేమో! ఈసారి సముద్రం తన భీకరమైన అలల వలలు విసిరి తీర ప్రాంతాల్లో స్వేచ్ఛగా తిరుగాడుతున్న మనుషుల ప్రాణాల్ని పట్టుకెళ్ళిపోయింది.

అతనికి తెలీకుండానే కళ్ళల్లోంచి నీళ్ళు కారిపోతున్నాయి. చూపు టివి మీదున్నా మనసు కొత్తపట్నం తీరంలో ఉంది.

''ఎందుకేడుస్తున్నావు తాతయ్యా''

అతను సమాధానం చెప్పలేదు. అతని గుండె పోటెత్తుతున్న సముద్రంలా ఉందిప్పుడు. అతని కళ్ళు రెండు జలపాతాలు...

చీకటి పడ్డాక కొడుకొచ్చాడు. అతన్ని చూడగానే కొమరయ్యకు ఏడుపు ఆగలేదు.

''ఒరే అయ్యా! మన కొత్తపట్నం ఏమైంది?''

''కొత్తపట్నం ఏంఖర్మ... ఐదు దేశాల్లో బోల్డు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్ని వేల మంది చచ్చిపోయి ఉంటారని అంచనా''. అతని మొహంలో బాధ లేశమాత్రమైనా లేకపోవటం కొమరయ్యని కలవరపరచింది. అంతటి ఘోర విపత్తు జరిగితే ఎంత యధాలాపంగా చెప్తున్నాడో....

నా గుండె సెరువైపోతుందిరయ్యా. మన పక్క గుడిశెలోని ఎంకడు ఏమయ్యాడో...మీ సూరీడు మామ ఎలా ఉన్నాడో..మంచానబడ్డ ఈరయ్య బాబాయి ఎలా ఉన్నాడో...అతని కొడుకులిద్దరూ ఏమయ్యారో...''

''సముద్రతీరంలో బతికే వాళ్ళు ఉప్పెన వచ్చినపుడల్లా నష్టపోవటం సహజమేకదా నాన్న. యింకా నయం. నువ్విక్కడే ఉండుంటే ఏమై ఉండేవాడివో...అదృష్టం.''

''అంత సులబంగా అంటావేమయ్యా? ఎంకడు, సూరీడు, ఈరయ్య బాబాయి కొడుకులూ...మేమంతా జట్టుగా సేపల ఏటకెల్లేవాల్లాం.''

''వాళ్ళందరి గురించీ మనకెందుకు? నువ్వు క్షేమంగా ఉన్నావు. చాలు.'' అంటూ కొడుకు తన గదిలోకి వెళ్ళిపోయాడు.

''ఎంత సులాగ్గా అనేశాడామాటని! ఈడి సిన్నప్పుడు ఎంకడి సంకనెక్కి దిగేవోడుకాదు. ఎంకడికి కొడుకుల్లేరు. అందుకే ఈడంటే పిచ్చి బెమ. ఎప్పుడూ ఎత్తుకునే తిరిగేటోడు. ఓపాలి పరీచ్చకి కట్టటానికి డబ్బుల్లేకపోతే సూరీడు కదూ...తను దాసి పెట్టుకున్న డబ్బులు తెచ్చి కట్టింది! నాకు బాగా గ్యాపకం...ఎవురెవుర్నో అడిగి, ఒట్టి సేతుల్తో తిరిగొచ్చి దుఃఖంతో ముడుసుకుని పడుకున్నానా రోజు... సూరీడే నా గుడిసెకొచ్చాడు. పిల్లాడి కోసరం డబ్బులు కావాల్నంటగా. ఎవురో నా సెవినేశార్లే. పక్కనే ఉన్న నన్నడగొచ్చుగా. ఆ మాత్తరం సేయలేనా'' అన్నాడు.

ఆడి గొంతులో సిరాకు నా మీద ఆడికున్న అబిమానమే. ఆడి సంగతి నీకు తెల్వదా... ఆడూ నాలానే పేదోడు. సేపలు పడకపోతే పెల్లాంబిడ్డలు – రెండు ఎండు సేపల్ని కాల్సుకుని తిని, సెంబుడు నిండా నీల్లు తాగి కడుపు నింపుకునే పరిస్థితి. అదే ఆడితో అన్నా.

''నిజమే అనుకో'' అంటూ సంద్రుడి ఎన్నెల్లా నవ్వాడు సూరీడు. ''ఈ ఏడు అమ్మాయి లగ్గం సేయాలనుకుంటున్నా కదా. దానికోసరమని దాసి పెట్టిన డబ్బుందిలే. లగ్గానికింకా మూడు నెల్లుంది. ఆడిక్కట్టాల్సిన డబ్బు తెచ్చా. తీసుకో'' అంటూ నా సేతిలో డబ్బులుంచాడు. పరీచ్చకి డబ్బుల కోసరం ఇంకెవురెవురి కాల్లు పట్టుకోవాలా దేవుడా అనుకుంటూ కుమిలిపోతున్న నా కల్లకు నా దోసిట్లో డబ్బులు పోసిన సూరీడు దేవుళ్ళా కన్పడ్డాడు. మన అవుసరంలో ఆదుకునేవోడే కదా దేవుడంటే.

నా అదురుష్టమో ఏమో ఓ రోజు బాగా సేపలు పడ్డాయి. పండగలా సంబరం నాలో.... ఆటిని అమ్మి సంతోసంగా సూరీడు గుడిసెకెల్లా. ''ఇదిగో నువ్విచ్చిన పైకం. కొద్దిగా ఆలీసమైంది. ఏమనుకోకు'' అంటూ తిరిగివ్వబోతే.. తీసుకోలా. నీల్ల మీద ఎండ పడి మెరిసినట్లు నవ్వి ''నేనేం అప్పుగా యియ్యలే. నా సావాసగాడి కొడుక్కి కానుగ్గా ఇచ్చా. మన ఇలాకాలో బాగా సదూకుంటున్న కుర్రాడు ఆడేగా. ఆ డబ్బు నా కూతురి లగ్గం కోసరమని దాశా. ఇది నీ కొడుక్కోసరమని కర్సు చేశా'' అన్నాడు. నాకు కల్లలో నీల్లు తిరిగాయి.

ఈ ఇసయాలన్నీ పరీచ్చలు రాసి తిరిగొచ్చిన నా కొడుకుతో సెప్పినపుడు ఆడి కల్లు నీటి సెలమలయ్యాయి. ''సూరీడు మామ ఎంత మంచోడు! ఎప్పటికైనా మామ రుణం తీర్చుకుంటానయ్యా'' అన్నాడు. అయన్నీ ఇపుడెలా మర్సిపోయాడో? ఆ నాడు ఆడి కల్లలో వూరిన నీటి సెలమలు ఏ ఎండ కొట్టి ఇగిరిపొయ్యాయో? ఈ పట్నం బతుకు రాకాసి తిమింగలంలా ఆడ్ని మింగేసింది. ఆడి కల్లకు సీకటి తప్ప ఎల్తురు కన్పట్టంలా'' కొమరయ్యలో దుఃఖం ఉప్పెనైంది.

ఆదివారం కావటం వల్ల మాంసం కూరతో పాటు కొమరయ్యకిష్టమని బొమ్మిడాయిల పులుసు చేశారు. ఐనా కొమరయ్యకు ముద్ద మింగుడు పడలేదు. తన కొడుకూ కోడలూ, పిల్లలూ హాయిగా నవ్వుతూ తుళ్ళుతూ ఏమీ జరగనట్లే భోజనాలు కానిచ్చారు.

కొన్ని వేలమంది చనిపోయారు. వేనవేల ప్రాణాలు...వేలవేల కుటుంబాలు...

ఎక్కడో ఏదో జరిగిందని, ఎవరో చనిపోయారని, ఇక్కడ మనం అన్నాలు మానేసి మాడి చావాలా?'' అన్నాడు కొడుకు.

మరునాటికి మరణాల సంఖ్య లక్షకి చేరింది. టీవీలో కొన్ని క్లిప్పింగ్స్ చూపిస్తున్నారు.

సముద్రపు అలలకు ఎండుటాకుల్లా కొట్టుకుపోయిన మనుషులు...

తెప్పల్లా తేలుతున్న యిళ్ళు...చచ్చిన చేపల్లా తేలియాడ్తున్న శవాలు...యిసుకలో కూరుకుపోయిన మృతదేహాలు...నీళ్ళకు ఉబ్బిపోయిన శరీరాలు.. ఎటు చూసినా మృత్యుదేవత కరాళ నృత్యం....

అతనికో విషయం విషంలా మింగుడు పడటం లేదు. పిల్లలు సరే...పట్నంలోపుట్టి పెరిగిన కోడలు సరే..సముద్రపు ఒడిలో పెరిగి యింత వాడైన తన కొడుకు కూడా స్పందించకపోవటం... ఇంటి కాంక్రీట్ గోడల్లా... చలనం లేనట్లు... హృదయం లేనట్లు...

సాటి మనుషులు... వందలూ వేలు కాదు.. లక్షలు... లక్షల మనుషుల ప్రాణాలు... ఎంత హృదయ విదారకమైన సంఘటన! తన బెస్తపల్లెని పొట్టన పెట్టుకున్నట్లే కొన్ని వేల పల్లెల్ని దిగమింగిన మహమ్మారి ఉప్పెన...

తనకు కడుపులో చేయి పెట్టి తిప్పేస్తున్నట్టు... గుండెనెవరో పిండేస్తున్నట్లు ఉంది. అన్నమెలా సయిస్తుందీ... మనిషన్నాక కన్నీటి చెలమ వూరకుండా ఎలా ఉంటుందీ....

''నీ కిష్టమని రొయ్యల కూరొండితే తినవేం?'' అంది కోడలు.

చేపల్ని చూసినా, రొయ్యల్ని చూసినా నా వేట కోసం వెళ్ళిన కొన్ని వేలమంది జాలర్లు గుర్తొస్తున్నారు. వారి కుటుంబాలు గుర్తొస్తున్నాయి.

లక్షకు పైగా మనుషులు చచ్చిపోయినా ఒక్క కన్నీటి చుక్క కూడా రాల్చని ఈ మనుషుల మధ్య అతనుండలేక పోతున్నాడు. ఘోర విపత్తు సంభవించినా ఏమీ జరగనట్లే వున్న ఈ మనుషులంటే అతనికి వెగటనిపిస్తోంది.

''నేను మనూరెల్తాను'' అన్నాడు మరునాడు.

''ఏముందని మనూర్లో? నీకు తెల్సిన కొద్ది మంది కూడా ఈ సునామీ వల్ల చచ్చిపోయి ఉంటారు. మరోసారి సునామీ రావొచ్చని అనుకుంటున్నారు.'' అన్నాడు కొడుకు.

''వచ్చినా పర్లేదు. సముద్దరాన్ని నమ్ముకుని బతికినోణ్ణి. సముద్దరంలా గుండె సెరువైనోణ్ణి. కన్నీళ్ల ఉప్పదనం రుసి ఎరిగినోణ్ణి. మనిసిగా బతకటం తెలిసినోణ్ణి. నీళ్ల బైటపడ్డ సేపపిల్లలా నేనిక్కడ బతకలేనయ్యా. నే వెళ్తున్నా'' అంటూ లేచాడు.

కొత్తపట్నానికి బయల్దేరిన కొమరయ్య సాగర సంగమం కోసం ఉరకలెత్తుతున్న నదీ ప్రవాహంలా ఉన్నాడు.

★



## అలనాటి హీరోయిన్

పదేళ్ళ క్రితంనాటి ఈ హీరోయిన్ పేరు గుర్తుందా? 'కభీ హా... కభీ న' సినిమాలో నటించిన సుచిత్రా కృష్ణమూర్తే ఈ ఫోటోలో వున్నది. శేఖర్ కపూర్‌ని పెళ్ళి చేసుకున్న తర్వాత ఒక బిడ్డకు తల్లయింది. ప్రపంచమంతా తిరిగింది. కవిత్వం రాసింది. పెయింటింగ్స్ వేసింది. మ్యూజిక్ ఆల్బం తీసుకొచ్చింది. ఇప్పుడు బోర్ కొట్టి అనిల్ కపూర్‌తోపాటు 'మై వైఫ్స్ మర్డర్' సినిమాలో యాక్ట్ వేసింది. ఆ సినిమాపై ఎవరికీ పెద్ద ఆశలు లేవు కాబట్టి సుచిత్ర మళ్ళీ తెరపై కొత్తగా సాధించేదేమీ వుండదు. నాటక రంగంలో కూడా సుచి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. 'క్యాండిల్ లైట్' అనే నాటకాన్ని సొంతంగా రాయడమే కాకుండా పాటలు కూడా రాసింది. బెస్టాఫ్ లక్ సుచి!